సన్నాలకు బోనస్ వచ్చేదెప్పుడో..?



కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణ (ఫైల్)

- మండలాల్లో 1,474 మంది రైతుల ఎదురు చూపు
- 6,728 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణ
- ఇంకా విడుదల కానీ డబ్బులు

వనపర్తి రూరల్: ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడంతో రబీలో రైతులు సన్నరకం వరి సాగు చేసుకున్నారు. దళారులకు కాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించారు. పూర్తై రెండునెలలు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో మాత్రం బోనస్ డబ్బులు జమకాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2025 రబీలో వనపర్తి మండలంలోని సింగిల్‌విండో ద్వారా 567 మంది రైతులతో 1,477 క్వింటాళ్లు, ఐకేపీ ద్వారా 140 మందితో 485 క్వింటాళ్లు, పెబ్బేరు మండల పరిధిలో సింగిల్ విండో ద్వారా 440 మందితో 2,635 క్వింటాళ్లు, ఐకేపీ సెంటర్ల ద్వారా 172 మంది రైతులతో 1,119 క్వింటాళ్లు, శ్రీరంగాపురం మండలంలో సింగిల్‌విండో ద్వారా 155 మందితో 1,012 క్వింటాళ్ల సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. వనపర్తి, పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల్లో రబీలో వరి కోతలు పూర్తయి కొనుగోళ్ల విక్రయాలు జరిపారు. ఐకేపీ సింగిల్ విండో ఆధ్వర్యంలో సన్న రకం కొనుగోలు చేసి పలు రైసుమిల్లులకు తరలించారు. సాధారణ రకం వడ్లకు ఇచ్చిన ప్రకారం డబ్బులు రైతుల ఖాతాలో జమ చేశారు. కానీ సన్నాలకు సంబంధించిన బోనస్ మాత్రం ఇంకా జమ కాలేదు. దీంతో రైతులు ఎదురుచూపులు తప్పడం లేదు.

ఎదురు చూపులు తప్పడం లేదు

సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం అందిస్తామన్న బోనస్ కోసం ఎదురుచూస్తున్నాను. కష్టనష్టాలనుకోర్చి ధాన్యం సాగు చేశాను. వెంటనే బోనస్ డబ్బులు జమచేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

– విజయుడు, సూగూరు

పట్టించుకోని ప్రభుత్వం

ధాన్యం అమ్మిన డబ్బులను బ్యాంకులో జమ చేశారు. కానీ బోనస్ మాత్రం జమ కాలేదు. నెలలు గడుస్తున్నా బోనస్ డబ్బులు బ్యాంక్‌లో జమ కాలేదు. ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ వెంటనే రైతులఖాతాలో జమ చేయండి

–జే.శాంతయ్య, శ్రీరంగాపురం మండల

కస్తూర్బాను సందర్శించిన ఎంఈఓ

సాక్షి ఎఫెక్ట్..

పాన్‌గల్: 'కేజీబీవీ పరిసరాల్లో మురుగుతో అవస్థ' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం వచ్చిన వార్తకు అధికారులు స్పందించి ఎంఈఓ శ్రీనివాసులు కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించారు. విద్యాలయం పరిసరాలను పరిశీలించారు. విద్యాలయం నుంచి వచ్చే మురుగు నీటికి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బంది ఉందని తాత్కలికంగా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటూ, పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపడతామన్నారు. సమస్యలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.



కస్తూర్బా పరిసరాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

మదనాపురం: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తెలంగాణ ఉద్యమ జేఏసీ కన్వీనర్ వాసురెడ్డి, భాస్కర్ సోమవారం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పద్మావతమ్మ, నాయకులు జక్కుల నాగన్నయాదవ్, మండల కన్వీనర్ మహేష్‌తో పాటు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

క్లుప్తంగా

విద్యార్థులకు బహుమతులు అందజేత



పాన్‌గల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన పాటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సోమవారం ఎంఈఓ శ్రీనివాసులు నగదు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాల 5వ తరగతి విద్యార్థినీ సన ప్రథమ బహుమతి, పీఎస్ అన్నారం పాఠశాలకు చెందిన నందిక ద్వితీయ బహుమతి, పీఎస్ రాయినిపల్లికి చెందిన బన్నీ తృతీయ బహుమతి అందజేశారు. విద్యార్థులకు దాత రాజశేఖర్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున నగదును అందజేశారు.

ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై ఫిర్యాదు



పాన్‌గల్: మండలంలోని రేమద్దుల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేసి పేదలకు న్యాయం చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపాలమహేష్, జిల్లా కార్యదర్శి మహేష్, జిల్లాకమిటీ సభ్యులు లక్ష్మణ్ మాట్లాడారు. ఇళ్లు లేని పూరిగుడిసెలు, రేకులషెడ్లలో నివాసముంటున్న వారికి మంజూరు చేయకుండా పక్కా ఇళ్లు వున్న వారికే మంజూరు చేయడం సమంజసం కాదన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత



వీపనగండ్ల: ప్రమాదంలో చనిపోయిన లబ్ధిదారుడి కుటుంబానికి బ్యాంకు అన్నివిధాలుగా ఆదుకుంటుందని మేనేజర్ రఘునందన్‌గుప్తా అన్నారు. దగడపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథమాధవి రూ.750 ప్రమాదబీమా డబ్బులు చెల్లించింది, గత సంవత్సరం ప్రమాదవశాత్తు ఆమె మరణించగా, భర్త రాఘవాచారికి సోమవారం బ్యాంకు ఆవరణలో రూ.20 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్‌లు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దాతకు సన్మానం



పాన్‌గల్: మండలంలోని దొండాయిపల్లి ప్రాథమిక పాఠశాలకు ఆర్థిక తోడ్పాటునందించిన గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డిని సోమవారం ఎంఈఓ శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి రూ.లక్ష పాఠశాల భవనానికి పెయింటింగ్, డ్రం సెట్, బెంచీలు జనార్దన్‌గౌడ్ అనే మరో దాత రూ.50 వేల విలువైన పాఠశాల కార్యాలయ గది నిర్మాణం, కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.15 వేల విలువైన మూడుటేబుల్స్ పాఠశాలకు అందించినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాందాపూర్ హెచ్ఎం ఆనంద్, లెక్చరర్ కవిత, హెచ్ఎం శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

గోపాల్‌పేట: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నరేష్‌కుమార్ తెలిపారు. సోమవారం అనుమతులు లేకుండా చెన్నూరు వాగునుంచి గోపాల్‌పేట వైపు ఇసుక తరలిస్తుండగా రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని ముగురిపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. నల్లవోతు యాదగిరి, గోపాల్‌నాయక్, తెలుగు రాములుపై కేసునమోదు చేశామని తెలిపారు. ఇళ్లకు తప్పనిసరిగా అనుమతులు తీసుకుని ఇసుక తరలించుకోవాలని లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముమ్మరంగా 100 రోజుల కార్యాచరణ

అమరచింత: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని ఒకటో వార్డులో సోమవారం పరిసరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని ప్రజలు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

అదనపు కలెక్టర్‌ను కలిసిన తహసీల్దార్



అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్

కొత్తకోట రూరల్: జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కీమ్యానాయక్‌ను తహసీల్దార్ వెంకటేశ్వర్లు సోమవారం సాయంత్రం వారి చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేను ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, తహసీల్దార్ మండలంలో రెవెన్యూ సమస్యలపై చర్చించడంతో పాటు భూ భారతి రెవెన్యూ సదస్సులో మండలంలో వచ్చిన దరఖాస్తును వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సూచించినట్లు తహసీల్దార్ తెలిపారు.

కాల్వలో జమ్ము తొలగింపునకు చర్యలు



ముళ్ల పొదలను పరిశీలిస్తున్న అధికారులు

అమరచింత: భూత్పూరు రిజర్వాయర్ నుంచి ప్రధానుఎడమ కాల్వ నుంచి పెద్దచెరువుకు సాగునీర అందడంలో అలస్యం అవుతుండటంతో కాల్వలో ఉన్న జమ్మును తొలగించేందుకు ఇరిగేషన్ అధికారులు ముందుకొచ్చారు. అమరచింత ,పాంరెడ్డి పల్లె, పిన్నంచర్ల గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమ చెరువులకు సాగునీరు అందడం లేదని విషయాన్ని ఇరిగేషన్ అధికారులకు విన్నవించమని మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డికి ఆదివారం కలిసి విన్నవించారు. తమ సొంత డబ్బులను వెచ్చించి జమ్ము తొలగిస్తామని అధికారులకు తెలిపారు. దీంతో సోమవారం ఇరిగేషన్ అధికారులు కాల్వ వెంట ఎన్ని మీటర్ల పొడవునా జమ్ము, ముళ్ల పొదలు వ్యాపించి ఉన్నాయనే విషయాలను కాల్వవెంట తిరుగుతూ పరిశీలించారు. త్వరితగతిగా తొలగిస్తామన్నారు.

బ్యాంకుకు స్థల పరిశీలన



గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గ్రామంలో యూనియన్ బ్యాంకు బ్రాంచి ఓపెన్ చేసేందుకు సోమవారం యూనియన్ బ్యాంకు అధికారులు విజిట్ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రాంచి ఓపెనింగ్ చేయాల్సిన బిల్డింగ్ పరిసరాలు మిగతా వివరాలు పరిశీలించారు. బ్యాంకు అధికారులు మాట్లాడుతూ.. గతంలోనే బుద్దారంలో బ్రాంచి ఏర్పాటుకు పరిశీలించామని ప్రస్తుతం ఇక్కడ ఏర్పాలు చేయబోతున్నామని నిర్ధారించారు. బుద్దారం గ్రామంతోపాటు సమీపంలోని గ్రామాల ప్రజలు యూనియన్ బ్యాంకు సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు శివకుమార్, అనిల్‌కుమార్, స్థానికులు అచ్చుతరామారావు, శ్రావణ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించండి

వనపర్తి రూరల్: రాబేయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పార్టీ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ పురుషోత్తం రెడ్డి సూచించారు. మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీరంగాపురం మండలంలోని జా నంపేటలో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల కు వివరించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడానికి చేతకాక 42 శాతం బీసీల రిజర్వేషన్ కోసమని కేంద్రంపై అ బద్ధపు నిందలు వేస్తూ ఎన్నికలకు దాటవేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, శివ, మల్లేష్‌యాదవ్, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



జానంపేటలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఎంపీ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకుల ధర్నా

పెద్దకొత్తపల్లి: ఎంపీ మల్లురవి మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ్మకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ఆందోళన చేపట్టారు. ఈనెల 2వ తేదీన కొల్లాపూర్‌కు వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సభలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి మాట్లాడుతుండగా సమయభావం తక్కువగా ఉందని ప్రసంగాన్ని ముగించాలని చిట్టిపై రాసిచ్చిన మార్కెట్ కమిటీ చైర్మన్‌ను ఎంపీ ఇష్టానుసారంగా దూషించి అవమానపర్చడం తగదన్నారు. గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. బస్టాండ్ కూడలీలో వాహనాలు బారులు తీరి ట్రాఫిక్ జాం అయ్యింది. ఎస్ఐ సతీష్ ధర్నా చేస్తున్న వారికి నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు ధర్మేందర్, బద్యానాయక్, మత్స్యకార్మిక సంఘం నాయకులు రామస్వామి, మండల అధ్యక్షుడు ఎల్లయ్య, మాజీ వార్డు సభ్యులు మహేష్, రవినాయక్, శ్రీరాములు, శ్రీను, భీరయ్య , బుడగ జంగాల నాయకులు పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న కాంగ్రెస్, వివిధ కుల సంఘాల నాయకులు

సెల్‌ఫోన్ అందజేత

ఆత్మకూర్: నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా బాధితులకు చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరి చేసి సోమవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై నరేందర్ తెలిపారు. గుంటిపల్లి గ్రామానికి చెందిన రాజేష్ చెందిన సెల్‌ఫోన్ మార్చి 30న చోరికి గురైందన్నారు. ఆత్మకూర్‌లో ఫోన్‌ట్రేస్ చేసి స్వాధీనం చేసుకుని బాధితులకి అప్పగించినట్లు తెలిపారు. సెల్‌ఫోన్లు చోరైన లేదా పోగొట్టుకున్న సీఈఐఆర్ పోర్టల్‌ద్వారా నమోదు చేయాలని సూచించారు.



బాధితుడికి సెల్‌ఫోన్లు అందజేస్తున్న పోలీసులు

దాడి ఘటనలో ఒకరిపై కేసు నమోదు

పాన్‌గల్: వ్యవసాయ పొలంలో నీటి విడుదల్లో ఒకరిపై దాడిచేసి గాయపర్చిన ఘటనపై సోమవారం కేసు నమోదైనట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు. హెచ్‌సీ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని శాగాపూర్ గ్రామానికి చెందిన వంగూరు కుర్మయ్య సోమవారం రోజు తన వ్యవసాయ పొలంలో వరి చేనులో నీరు ఎక్కువగా ఉందని కిందకు వదిలేందుకు ఒడ్డును ధ్వరంం చేశాడు. పక్కన ఉన్న వ్యవసాయ పొలం యజమాని సుల్తాన్ వచ్చి నీళ్ళు కిందకు ఎందుకు వదిలినావు అంటూ అసభ్య పాదజాలంతో దూషిస్తూ చేతిలో ఉన్న పారతో దాడి చేసి గాయపర్చాడు. దూషించి పారతో దాడి చేసి గాయపర్చిన సుల్తాన్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ వంగూరు కుర్మయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

పేదల సంక్షేమానికే పెద్దపీట

పాన్‌గల్: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్ అన్నారు. సోమవారం పాన్‌గల్, కేతేపల్లి, బండపల్లి గ్రామాల్లో మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు మంజూరు చేశామని ఆయన పేర్కొన్నారు. మంత్రి జూపల్లి సహకారంతో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నట్లు పేర్కొన్నారు. కేతేపల్లిలో 37, పాన్‌గల్‌లో 27, బండపల్లిలో 9 ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రవికుమార్, వెంకటేష్‌నాయుడు, ఏఈ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



మంజూరు పత్రాలను అందజేస్తున్న నాయకులు

ఆలయానికి దారేది

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రముఖ ఆలయంగా పేరున్న చింతల హనుమాన్ గుడి ఎదుట మట్టి దిబ్బెలు, కంకర పెచ్చులు ఊడిన సిమెంట్ ప లకల దిమ్మెలను ఓ పక్కకు బొద్దె పోశారు. సీసీ రో డ్డు నిర్మాణానికి వారం రోజుల క్రితం జేసీబీ సా యంతో రోడ్డును ఇబ్బడిముబ్బడిగా తవ్వి మట్టి ది బ్బెలను, రాళ్లను, కంకర పెచ్చులను గుట్టగా పేల్చారు. కనీసం వాటిని తొలగించేందుకు చొరవ చూపకపోవడంతో ఆలయానికి వచ్చే భక్తులకు రాళ్లు, మట్టిదిబ్బెల్లో నడవడమే కష్టంగా మారిందని ఉందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి అడ్డూ..అదుపు లేకుండా పోయిందని ఆలయానికి వచ్చేభక్తులు ముక్కున వేలేసుకుంటున్నారు. శ్రావణమాసం కావడంతో భక్తుల రద్దీ ఉదయం, సాయంత్రం అధికంగా ఉంటుంది. ఓ వైపురోడ్డును చదును చేయకుండా నడిచేందుకు వీలు లేకుండా తవ్వేసి వదిలేయడంతో ఏ మాత్రం చొరవ చూపకపోవడంతో మున్సిపల్ అధికారుల తీరుపై పెదవి విరుస్తున్నారు.



ఆలయం ఎదుట ఏపుగా పోసిన మట్టిదిబ్బెలు

ఐదుగురు బైండోవర్

ఆత్మకూర్: అలజడులు సృష్టిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఐదుగురిని తహసీల్దార్ చాంద్‌పాషా ఎదుట సోమవారం సాయంత్రం బైండోవర్ చేసినట్లు ఎస్సై నరేందర్ తెలిపారు. ఆత్మకూర్‌కు చెందిన శ్రీను, కురుమూర్తి, శ్యామ్, ఆనంద్, శ్రీనివాసులు స్థానిక మంజునాథ రెస్టారెంట్లో మద్యం తాగి గొడవకు పూనుకున్నారని వివరించారు. పట్టణంలో తప్పతాగి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, సత్ప్రర్తనలో భాగంగా బైండోవర్ చేసినట్లు వెల్లడించారు.



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన ఎస్సై

కేజీబీవీలో చేరని విద్యార్థినులు

- ఆయా పాఠశాలల్లో 142 సీట్లు ఖాళీ
- నేరుగా చేర్చుకునేందుకు ఎస్ఓలకు అవకాశం

అమరచింత: గతేడాది కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు విద్యార్థినులు పోటీ పడి దరఖాస్తు చేసుకోగా ఈసారి ఇందుకు భిన్నంగా విద్యార్థినులు ఇంటర్ కోర్సుల్లో చేరేందుకు అనాసక్తి చూపుతున్న పరిస్థితి దాపరించింది. జిల్లాలోని 8 కేజీబీవీలో ఆయా కోర్సుల్లో ఇంకా 142 సీట్లు ఖాళీగా ఉన్నట్లు జీసీడీఓ ప్రకటించడం జరిగింది. కేజీబీవీలో చేరేందుకు విద్యార్థినులకు గత 30న నేరుగా సంబంధిత ఎస్ఓలకు ఎస్ఎస్‌సీ మెమోలతో పాటు బోనఫైడ్‌లు అందజేసి చేరుకోనేందుకు అవకాశం కల్పించారు. కేజీబీవీ, గురుకులలో సీట్లు దొరకక రాజకీయ పార్టీల నాయకుల పైరవీలతో సీట్లు దక్కించుకున్న పరిస్థితుల నుంచి నేడు నేరుగా తమ పాఠశాలలో సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థినులు చేరేందుకు అవకాశం కల్పిస్తున్నామని ప్రకటించే స్థాయికి రావడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్య కాలంలో కేజీబీవీలో చదువుకుంటున్న విద్యార్థినులు ఆయా పాఠశాలలో సౌకర్యాలు లేవని, కనీసం మరుగుదొడ్ల సమస్య సైతం పరిష్కరించడం లేదని, ఆహార విషయంలో కూడా సరైన మెనూ పాటించడం లేదని దీంతో తమకు అక్కడ ఉండేందుకు అసక్తి లేదనే విషయాలను తల్లిదండ్రులకు వివరిస్తున్న సమస్యలను సైతం పరిష్కరించే వారు లేక పోవడంతో విద్యార్థినులు చేరేందుకు ఆసక్తి కనబర్చడం లేదనే విమర్శలు ఎక్కువయ్యాయి. ఏదీఏమైన ఈసారి ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అధికారులు ప్రయత్నాలు జరుపుతున్న చేరేందుకు విద్యార్థులు కరువయ్యారు. అమరచింత కేజీబీవీలో ఆంగ్లమీడియంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 40సీట్లకు గాను 25 సీట్లు నేటికీ భర్తీ కాకపోవడం వింతగా ఉంది.



అమరచింతలోని కేజీబీవీ

పాఠశాలల వారీగా ఖాళీల వివరాలు..

జిల్లాలోని ఖిలాఘనపురం మండలంలోని కేజీబీవీ ఇంగ్లిష్ మీడియంలో కంప్యూటర్ సైన్స్‌లో 22సీట్లు, కొత్తకోటలోని కేజీబీవీలో ఫైనాన్స్అండ్ అకౌంటెన్స్ కోర్సులో 23 సీట్లు, గోపాల్‌పేట కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో సీఈసీలో 12 సీట్లు ఖాళీగా ఉన్నాయి. చిన్నంబావి మండలంలోని కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంఎల్‌టీ, బైపీసీలో 12 సీట్లు, శ్రీరంగపురంలోని కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో బైపీసీ, ఎంపీసీలలో 12 సీట్లు, రేవల్లిలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంఎల్‌టీ, సీఈసీలో 16సీట్లు, పాన్‌గల్ కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో కంప్యూటర్ సైన్స్‌లో 20సీట్లు, అమరచింత కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో 25 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

ఖాళీల భర్తీకి చర్యలు..



కేజీబీవీలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటున్నాం. ఇదివరకు సీట్లు కావాలని అని దరఖాస్తు చేసుకున్న వారికి సమాచారం ఇవ్వాలని సంబంధిత ఎస్ఓలకు ఆదేశించాం. కొత్తగా చేరే వారికి అవకాశం కల్పిస్తున్నాం. విద్యార్థినులు నేరుగా ఆయా కేజీబీవీల ఎస్ఓలకు కలిసి పాఠశాలలో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నాం.

– శుభలక్ష్మి, జీసీడీఓ